సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి



జోనల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న బోయ నగేష్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నగేష్ కోరారు. జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీనివాస్ రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బోయ నగేష్ మాట్లాడుతూ..ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. దీంతో పాటు అంసపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను కూడా సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

సన్మానం



గౌలిపురా: టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సోమవారం నాటికి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి వెంకటేశ్ కలిశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మహేశ్ కుమార్‌ను సత్కరించారు. వెంకటేశ్ మాట్లాడుతూ..ఏడాది కాలంలో మహేశ్ కుమార్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా అంకిత భావంతో సమర్థవంతంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారన్నారు.

రామాయణ మేళా చీఫ్ కన్వీనర్‌గా గోవింద్‌రాఠి



అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దసరా వేడుకల సందర్భంగా నిర్వహించే రామాయణ మేళా 53వ చీఫ్ కన్వీనర్‌గా బీజేపీ గ్రేటర్ సీనియర్ నేత గోవింద్‌రాఠి నియమితులయ్యారు. ఎగ్జిబిషన్ సొసైటీ, రాజస్థానీ ప్రగతి సమాజ్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే రామాయణ మేళా వేడుకలకు గోవింద్‌రాఠి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ సంవత్సరం కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో రామాయణ మేళా వేడుకలు, దాండియా ఉత్సవాలు, రావణ దహనం, దసరా వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు.

నాలా పనుల పరిశీలన



యాకుత్‌పురా: గంగానగర్ నాలా ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్ట్ పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. గంగానగర్ నాలా నుంచి డబీర్‌పురా వరకు కొనసాగుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా ప్రాజెక్ట్ పనులను సోమవారం ఆయన రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాలా సమీప ప్రాంతాల్లో ముంపు సమస్యలను పరిష్కరించేందుకు రూ.2.6 కోట్లతో గంగానగర్ నాలా అభివృద్ధికి మరమ్మతు పనులు చేపట్టామన్నారు. కొన్ని రోజులుగా జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్ట్ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. నాలా పైకప్పు పనులకు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

యువ కళాకారుల ప్రతిభకు ప్రోత్సాహం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక పునర్వైభవం కోసం కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో క్రియేటీవ్ థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగనున్న కోహినూర్ థియేటర్ కార్నివాల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నాటకరంగంతో పాటు యువ కళాకారుల ప్రతిభకు తగిన ప్రోత్సాహం కల్పిస్తామన్నారు. అంతకు ముందు మీరాభాయి జీవిత చరిత్ర, చిన్నపిల్లలతో కూడిన నాటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత బి.శివప్రసాద్, అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకులు గణపతిరెడ్డి, ఆర్ట్‌ఫిల్మ్స్ ప్రతినిధి హర్ష, క్రియేటీవ్ థియేటర్ వ్యవస్థాపకులు మంకెనపల్లి అజయ్ పాల్గొన్నారు.

మల్లేపల్లిలో యథేచ్ఛగా నాలాల కబ్జా

- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ, హైడ్రా
- ఆక్రమణలను తొలగించాలని స్థానికుల డిమాండ్

నాంపల్లి: మల్లేపల్లిలో మురుగునీటి నాలాలు కబ్జాకు గురయ్యాయి. ఘటాల మసీదును నాలా మీదనే నిర్మించారు. ఇంకా హబీబ్‌నగర్ నాలా మీద వ్యాపారాలు కొనసాగుతున్నాయి. వీటికి తోడు వీధుల్లోని, ఇళ్లలోని చెత్తను నాలాల్లోకి విసిరేస్తున్నారు. దీంతో నాలాల్లో నీరు సాఫీగా వెళ్లేందుకు వీలు లేక నాలాలు పొంగి రోడ్ల మీద ప్రవహిస్తున్నాయి. ఇలా ప్రవహించిన నీరే ఆదివారం రాత్రి అఫ్జల్‌సాగర్‌లో ఇద్దరు యువకులు కొట్టుకుపోవడానికి కారణమైంది. మల్లేపల్లి ఘటాల మసీదు వద్ద నాలా కుంచించుకుని పోవడంతో నాలాలో నీళ్లు వెళ్లడానికి వీలులేక మహమూద్ ఆసుపత్రి వీధిలో నుంచి ధోబీఘాట్ మీదుగా వరద నీరు పోటెత్తింది. ఇలా పోటెత్తిన నీరు నాలాలో కొట్టుకునిపోయిన అర్జున్, రామ ఇళ్ల వద్దకు చేరుకుని వారి ఇళ్ల పక్కనే ఉన్న అఫ్జల్‌సాగర్ నాలాలో కలుస్తుంది. లోయర్ అఫ్జల్‌సాగర్ నాలాను కూడా యథేచ్ఛగా కబ్జా చేశారు. ఇక జీహెచ్‌ఎంసీ సిబ్బంది మాన్గార్‌బస్తీ, అఫ్జల్‌సాగర్ బస్తీల్లో కనిపించరు. వార్డు-11 కిందకు వచ్చే ఈ బస్తీలు ఎప్పుడూ మురుగులోనే ఉంటాయి.

అభివృద్ధికి దూరంగా మల్లేపల్లి..

నాంపల్లి నియోజకవర్గంలో మల్లేపల్లి అతి పెద్ద డివిజన్. ఇక్కడే అధికంగా మురికివాడలు ఉన్నాయి. అఫ్జల్‌సాగర్, మాన్గార్‌బస్తీ, హబీబ్‌నగర్, జవహర్‌నగర్, లోయర్ అఫ్జల్ సాగర్, లోధ్ బస్తీ, ధోబీఘాట్, డి-క్లాస్ క్వార్టర్స్,



అఫ్జల్‌సాగర్ నాలా

వాంబే కాలనీలు వర్షం వస్తే చాలు చెరువులా మారుతాయిది. ఈ బస్తీల్లో ఎక్కడా సిమెంటు



నాలాపై అడ్డంగా నిర్మించిన ఘటాల మసీదు ప్రహరీ

రోడ్లు కనిపించవు. మ్యాన్‌హోళ్ల నుంచి సాఫీగా వర్షపు నీరు వెళ్లే మార్గం ఉండదు. ఐదేండ్ల పాలన కోసం ఎన్నికైన కార్పొరేటర్ ఒకరోజు కూడా బస్తీలో తిరగలేదు. బల్దియా అధికారులు సైతం ఏదైనా సంఘటన జరిగితేనే కనిపిస్తారే తప్ప మళ్లీ అటు వైపు కన్నెత్తి చూడలేదు.

మల్లేపల్లిలో పాలన మారాలి..



60 ఏళ్లుగా మల్లేపల్లి డివిజన్ ఎంఐఎం పాలనలోనే కొనసాగుతోంది. అత్యధిక సార్లు మహిళలే ఇక్కడ ఎన్నికయ్యారు. నేటికీ ఎంఐఎం పార్టీకి చెందిన మహిళా కార్పొరేటరే ఉన్నారు. కార్పొరేటర్‌గా ఎన్నికయ్యే మహిళలు ఇంటికే పరిమితం అవుతున్నారు. మహిళా కార్పొరేటర్ల భర్తలే ప్రతినిధులుగా చెలామణి అవుతున్నారు. ఇలాంటి నేతలతోనే అఫ్జల్‌సాగర్ దుర్ఘటన జరిగింది. బాధితులను ఆదుకోవాలి. మల్లేపల్లిలో పాలన మారాలి.

– రాహుల్ చంద్ర, బీజేపీ నాంపల్లి ఇన్‌ఛార్జి

నాలా ఆక్రమణలను పూర్తిగా తొలగించాలి..



మల్లేపల్లిలో మురుగునీటి నాలాలకు ఇరువైపులా ఆక్రమణలు జరిగాయి. ఈ ఆక్రమణలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు వచ్చి పరామర్శిస్తారు. తర్వాత మళ్లీ ఇటు వైపు కన్నెత్తి చూడరు. వాంబే గృహాలు కూడా కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి కూలితే ఇంకెంత మంది చనిపోతారో తెలియదు. ప్రభుత్వం ఇప్పటికైనా అఫ్జల్‌సాగర్‌లో ఉన్న నాలాల విస్తరణ చేపట్టాలి. ఆక్రమణలను పూర్తిగా తొలగించాలి.

– జస్వంత్, స్థానికుడు

కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఉత్తమ పర్యావరణ వేత్త అవార్డు



కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి అవార్డు అందజేస్తున్న ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి

అఫ్జల్‌గంజ్: ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఉత్తమ పర్యావరణ వేత్త అవార్డు-2025 అందజేశారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి ఈ అవార్డును డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడతూ..ఓజోన్ పొరను రక్షించడం, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవితేజ, సూర్య, వేణుగోపాల్, ఘన్‌శ్యామ్‌తో పాటు తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డిని శుభాకాంక్షలు తెలిపారు.

లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడిగా ఇంద్రసేనారెడ్డి



లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి సభ్యులు

లంగర్‌హౌస్: ఈ ఏడాది దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి నూతన అధ్యక్షుడు, బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అల్వాల ఇంద్రసేనారెడ్డి అన్నారు. లంగర్‌హౌస్ దసరా ఉత్సవ సమితి నూతన అధ్యక్షుడిగా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, బస్తీ పెద్ద క్రిష్ణాయాదవ్ సమక్షంలో నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా పాండుకుమార్, కోశాధికారిగా సుధీర్‌యాదవ్‌ను ఎన్నుకున్నారు.

పెన్షన్లు పెంచాలని వినతి

చార్మినార్: వృద్ధులు, వితంతువులు, వికలాంగుల చేయూత పెన్షన్లును వెంటనే పెంచి అందజేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరేలి ఎలిషా మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం పెన్షన్ దారులతో కలిసి బహదూర్‌పురా తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెరేలి ఎలిషా మాదిగ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పింఛన్లను పెంచి అందజేయాలన్నారు. ఆందోళన అనంతరం బహదూర్‌పురా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చెన్నయ్య, రవి, శ్రీధర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి యాదశి నర్సింగ్ రావు పాల్గొన్నారు.



బహదూర్‌పురా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షేక్‌పేట్‌లో అంజన్‌కుమార్ యాదవ్ పర్యటన



రవికుమార్ ఇంట్లో ఉన్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

గోల్కొండ: వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని ఓయూ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లల్లో నేటికి వరదనీరు నిలిచి ఉండటాన్ని ఆయన పరిశీలించారు. స్థానిక కాలనీ సంక్షేమ సంఘం నాయకుడు రవికుమార్ ఇంట్లో రెండు అడుగులుగా నిలిచిన వరదనీటిని పరిశీలించారు. సహాయక బృందంలో రంగంలో ఉన్నాయని..సహాయక చర్యలు వెంట వెంటనే చేపడుతున్నామని అన్నారు. ఆయన వెంట షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, నిజాముద్దీన్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలకు ప్రతిభా పురస్కారం

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి ప్రతిభా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల అధినేత రమ, ఈకిడ్జ్ ఉపాధ్యాయ బృందానికి రూ.10 వేల నగదుతో పాటు రజత పతకంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ..విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పించి ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి,హైస్కూల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, ప్రైమరీస్కూల్ కో ఆర్డినేటర్ కె.ఫర్హానా, ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ రష్మిక, పాఠశాల ప్రిన్సిపాల్ శశిక పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను అభినందిస్తున్న నారాయణ విద్యాసంస్థల అధినేత రమ

ఫీజులు చెల్లించకపోతే రాష్ట్రంలో యుద్ధమే



ఉన్నత విద్యా మండలి ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్.కృష్ణయ్య

నాంపల్లి: కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయలు ఇవ్వడానికి డబ్బులు ఉంటాయి కానీ..చదువుకునే పిల్లలకు రూ.6వేల కోట్లు ఉండానికి లేవా అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ధ్వజమెత్తారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఎదుట ఫీజు బకాయిలు చెల్లించాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీలు, 17వ తేదీ నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని ప్రకటించారు. ఫీజులు బడ్జెట్ ఇవ్వకపోతే రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు. గుజ్జకృష్ణ, రాజేందర్, అల్లంపల్లి రామకోటి, అనంతయ్య, ఆశిష్‌గౌడ్, భాస్కర్, లింగయ్య యాదవ్, నిఖిల్ పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి

చార్మినార్: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సర్దార్‌మహల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్-1, ఫలక్‌నుమా-2 సర్కిళ్లకి చెందిన టౌన్ ప్లానింగ్ సమస్యలపై 3, చాంద్రాయణగుట్ట-1, చార్మినార్-2 సర్కిళ్లకి చెందిన ఇంజినీరింగ్ విభాగం సమస్యలపై 3 ఫిర్యాదు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..చార్మినార్ జోన్ పరిధిలోని మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలోని ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజావాణిలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్‌సింగ్, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ సీపీ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్ ఎలక్ట్రికల్ ఈఈ సతీష్ రెడ్డి, మలేరియా ఎస్ఈ శ్రీనివాస్, యూబీడీ టౌన్ ప్లానింగ్ ఏసీపీలు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన అన్నారు. సోమవారం ఆమె గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ విభాగం, వైద్యుల గదులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి నాలుగున్నర కోట్ల రూపాయలు గతంలోనే మంజూరయ్యాయని..అయితే నిధులు విడుదల కాలేదన్నారు. నిధులు విడుదల కాగానే భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. అంతేకాకుండా ఆసుపత్రి ల్యాబ్‌తో పాటు ఇతర విభాగాల పరికరాల కోసం రూ.1.70 లక్షలు మంజూరయ్యాయని..పరికరాలు కూడా త్వరలోనే సరఫరా అవుతాయన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రికి ఔట్ పెషెంట్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందని..దీనికి అనుగుణంగా ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ సూచనల ప్రకారం నూతన భవనంలో ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఇంకా దొరకని బాలుడి మృతదేహం

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనారోగ్యంగా ఉన్నాడని తండ్రి హత్య చేసి మూసీ నదిలో పడేసిన బాలుడి మృతదేహం ఇంకా లభ్యం కాలేదు. రెండు రోజులుగా డీఆర్‌ఎఫ్, హైడ్రా అధికారులు సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్ కెమెరాలతోనూ గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం..నూరీనగర్‌కు చెందిన అక్బర్ చిన్న కుమారుడు మహ్మద్ అనాస్(2.5 ఏళ్లు)కు గుండెకు సంబంధించిన సమస్య ఉండడంతో చికిత్స విషయమై భార్య, భర్తల నడుమ గొడవ జరుగుతుంది. దీంతో ఆగ్రహానికి గురైన అక్బర్ కుమారుడిని శుక్రవారం తెల్లవారుజామున ముఖంపై దిండు పెట్టి చంపి..సంచిలో మూటగా కట్టుకొని నయాపూల్ వద్ద మూసీ నదిలో పడేసిన విషయం విధితమే. ఫిర్యాదు అందుకున్న పోలీసులు రెండు రోజులుగా నయాపూల్ నుంచి దిగువకు మృతదేహం ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



జియాగూడ: జియాగూడ ధార్మిక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా, మూసీనది ఒడ్డున రావణ దహన వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని సమితి అధ్యక్షుడు శివకుమార్‌యాదవ్, చైర్మన్ మహేష్కర్ కాంతిలాల్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం జియాగూడ సంజయ్‌నగర్ సంత్ రవిదాస్ భవన్‌లో సమితి ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జియాగూడ, కార్వాన్ ప్రాంతాల ప్రజలు అధిక శాతం రావణ దహన కార్యక్రమానికి హాజరవుతారని ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జగదీష్‌యాదవ్, సీనియర్ నాయకులు దర్పల్లి నర్సింహులు, ముచింతల సత్యనారాయణ, సుదర్శన్ ముదిరాజ్, రమేష్ చౌగ్లే, వెంకటేష్ యాదవ్, నరేష్ కుమార్, కిషన్ దామ, గుర్రం శివశంకర్, సోమ్‌నాథ్, తులసిదాస్ పాల్గొన్నారు.

ఈ-పెట్టీ కేసులో ముగ్గురికి జైలు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఈ-పెట్టీ కేసులో ముగ్గురికి నాంపల్లి న్యాయస్థానం 15 రోజుల జైలు శిక్షను విధించింది. పోలీసుల వివరాల ప్రకారం..చాంద్రాయణగుట్టకు చెందిన ఆటోడ్రైవర్ జాఫర్(31), అజ్హార్ ఖాన్(30), మహ్మద్ ఎజాజ్(39)ఈ-పెట్టీ కేసులు నమోదయ్యాయి. కేసును విచారించిన న్యాయమూర్తి మంద మురళి నిందితులకు 15 రోజుల జైలు శిక్షను విధిస్తూ సోమవారం తీర్పును వెలువర్చారు.

మహిళ అదృశ్యం



యాస్మిన్ బేగం

గౌలిపురా: మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా జహంగీర్ నగర్‌కు చెందిన మహ్మద్ ముక్రం అలీ, యాస్మిన్ బేగం (36)లు దంపతులు. కాగా యాస్మిన్ బేగం గత సంవత్సర కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుంది. కాగా గత నెల 13న యాస్మిన్ బేగం ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గోషామహల్ పోలీస్‌స్టేషన్ రికార్డుల తనిఖీ



తనిఖీ చేస్తున్న గోషామహల్ ఏసీపీ సుదర్శన్, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఇతర ఎస్ఐలు

అబిడ్స్: గోషామహల్ పోలీస్‌స్టేషన్‌ను గోషామహల్ ఏసీపీ ఎస్.సుదర్శన్ తనిఖీ చేశారు. సోమవారం వార్షిక తనిఖీల్లో భాగంగా గోషామహల్ పోలీస్‌స్టేషన్‌లో కేసుల వివరాలు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ ఇండెక్స్, డయల్ 100 రిజిస్ట్రార్, ఆర్డర్ బుక్, రౌడీషీట్ల వివరాలు, సస్పెక్ట్ సీట్ల వివరాలు, ఎన్‌సీ రిజిస్ట్రార్, ఆర్‌టీఐ యాక్ట్ రిజిస్ట్రార్, పార్ట్ 1, పార్ట్-2, పార్ట్-3, పార్ట్-4 రిజిస్ట్రార్‌లతో పాటు ఇతర పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన పలు రిజిస్ట్రార్‌లను ఏసీపీ సుదర్శన్ తనిఖీలు చేసి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ సుదర్శన్ పోలీస్‌స్టేషన్‌లో శాంతిభద్రత పరిరక్షణ, రౌడీషీటర్ల తనిఖీలు, పోలీసుల పెట్రోలింగ్, వితర వివరాలు అన్ని తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏసీపీ సుదర్శన్ మాట్లాడుతూ..పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ఇతర పలు సెక్టార్లలో పనితీరు, ఇతర సిబ్బంది పనితీరు భేష్‌గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు లక్ష్మయ్య, అరుణోదయ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్‌ను రద్దుచేసి ఏఎన్ఎంలకు పనిభారం తగ్గించాలి



సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, మొబైల్ అప్లికేషన్‌ను రద్దుచేసి పని భారాన్ని తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. కమిషనర్‌తో ఏఐటీయూసీ నాయకులు నిర్వహించిన చర్చలు విఫలం కావడంతో తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అంతేకాకుండా కమిషనర్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఏఎన్ఎంలను పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులకు ఏఎన్ఎంల మధ్య తోపులాట జరగడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. రాష్ట్ర 2వ ఏఎన్ఎంల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పద్మ, శ్యామల, తస్వీర్ సుల్తాన, జయమ్మ, కృష్ణవేణి, రాణి, సరిత, సంతోషిణి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.